13042025-MAI-04_Layout 1 4/13/2025 2:34 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# హస్తం-బీజేపీ.. పటేల్ పంచాయితీ



డాక్టర్ అయాచితం శ్రీధర్
98498 93238

స్వాతంత్ర్య సమరయోధుడు, భారతదేశ తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను సొంతం చేసుకోవడానికి బీజేపీ ఆరాటపడుతున్నది. ఆ దేశభక్తునికి మతం మకిలి అంటించే ప్రయత్నం చేస్తున్నది. ఇంతకాలం తనకేమీ పట్టనట్టు వ్యవహరించిన కాంగ్రెస్.. పటేల్ తమవాడేనని కొత్త రాగం ఎత్తుకుంది. పటేల్ స్ఫూర్తితో మతతత్వంపై పోరాటం చేస్తామని ఇటీవల అహ్మదాబాద్‌లో జరిగిన పార్టీ వర్కింగ్ కమిటీ విస్తృత స్థాయి సమావేశంలో కాంగ్రెస్ ప్రకటించింది. దేశం కోసం సర్వస్వం త్యాగం చేసి పోరాడిన వీరులను, వారి విజయాలను స్ఫూర్తిదాయక చరిత్ర నుంచి అపహరించి తమ ఖాతాల్లో వేసుకోవడానికి పథకం ప్రకారం ఈ రెండు ప్రధాన జాతీయ పార్టీలు పోటీ పడుతున్నాయి.



అందరివాడైన గాంధీజీని తమవాడేనని చెప్పుకొంటూ చెలామణి అవుతున్న కాంగ్రెస్ దారిలో స్వాతంత్ర్య ఉద్యమంలో ఏ పాత్రలేని బీజేపీ అమరులైన స్వాతంత్ర్య ఉద్యమకారులను ఒక్కొక్కరిని తన వైపు లాక్కుంటున్నది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చే వరకు పోరాడిన వీరులంతా ఈనాటి కాంగ్రెస్, బీజేపీలకు ఏ మాత్రం సంబంధం లేని వాళ్లు. ఎందుకంటే స్వాతంత్ర్యం వచ్చాక కాంగ్రెస్ యథాతథంగా లేదు. ఎన్ని ముక్కలైందో ఆ పార్టీ వారికే తెలియదు. ఇవాళ కనిపిస్తున్న కాంగ్రెస్ అందులో ఓ ముక్క. ఇక బీజేపీ 1951లో భారతీయ జన్‌సంఘ్ (దీపం గుర్తు)గా ప్రారంభమై, 1977లో జనతా పార్టీలో విలీనమై, తిరిగి 1980లో భారతీయ జనతా పార్టీగా అవతరించింది. స్వాతంత్ర్యం సిద్ధించే నాటికి, పటేల్ గతించిన 1950 నాటికి ఆ పార్టీ పుట్టనే లేదు. స్వాతంత్ర్యానికి ముందు కాంగ్రెస్ ఒక పార్టీ కాదు. ఒక విశాల ఐక్య వేదిక. కాంగ్రెస్ అంటేనే సభ లేదా సమావేశమని అర్థం. అందులో అందరూ ఉన్నారు. అందుకే స్వాతంత్ర్యం రాగానే కాంగ్రెస్‌ను రద్దు చేయమని గాంధీజీ అన్నారు. 1947లో దేశానికి స్వాతంత్ర్యం రావడంతోనే కాంగ్రెస్ చిరస్మరణీయ పాత్ర ముగిసింది. 1952 తొలి లోక్‌సభ సాధారణ ఎన్నికల నాటికి కాంగ్రెస్ అధికారం కోసం రంగంలోకి దిగిన ఫక్తు రాజకీయ పార్టీగా అవతరించింది.

> **బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రెండూ తమ పూర్వీకులను మరచిపోయి చాలా కాలమైంది. మాజీ ప్రధాని వాజపేయి, ఉక్కు మనిషిగా పేరు తెచ్చుకున్న లాల్ కృష్ణ అద్వానీ అతిరథ మహారథులే అయినా, బీజేపీని తొలిసారిగా కేంద్రంలో అధికారంలోకి తెచ్చినవారే అయినా ప్రస్తుత కమలం నేతలు వారిని పట్టించుకోవడం మానేశారు. మోదీ-షా పూజల్లో పునీతులు అవుతున్నారు.**

ఇక కాంగ్రెస్ పార్టీకి చెందిన స్వాతంత్ర్యోద్యమ నేతలు, త్యాగధనులు ప్రజా నాయకులు ఎందరో ఉన్నా కేవలం ఇందిరమ్మ, రాజీవ్ నామ స్మరణలోనే ఆ పార్టీకి చెందిన నేటి నేతలు తరిస్తున్నారు. చివరికి నెహ్రూను కూడా మర్చిపోయారు. బీజేపీ అంటే మోదీ- షా, కాంగ్రెస్ అంటే ఇందిరమ్మ, రాజీవ్.. ఇదీ నేటి జాతీయ రాజకీయ ముఖచిత్రం. ఈ రెండు పార్టీలకు పటేల్ ఉన్నట్టుండి ఆరాధ్యుడు అయిపోయారు. హిందూత్వ లౌకిక రాజకీయాలతో దేశం సైద్ధాంతికంగా నిలువునా చీలిపోతున్న ఈ సందర్భంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పటేల్ భుజంపై తుపాకీ పెట్టి కాల్చాలని చూస్తున్నాయి.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక 559 సంస్థానాలు నయానో, భయానో దేశంలో విలీనమయ్యాయి. కశ్మీర్ సమస్య జటిలం కాగా జునాగఢ్, హైదరాబాద్ సంస్థానాలు విలీనం కాకుండా మొరాయించాయి. అప్పుడు ఉప ప్రధానిగా, హోం మంత్రిగా ఉన్న పటేల్ వరుసగా ఒక్కొక్క సంస్థానాన్ని దండోపాయంతో దారికి తెచ్చుకుని 1948 నాటికి దేశంలో విలీనం చేశారు.

> **మరీ కొరకరాని కొయ్యగా మారిన నిజాంను లొంగదీసుకోవడానికి హైదరాబాద్ నాలుగు వైపుల నుంచి భారత సైన్యాలు దాడి చేశాయి. అది సైనిక చర్య. కానీ, పోలీస్ చర్యగా పేరు పడింది. నాటి ప్రధాని నెహ్రూకు గాని, రక్షణ మంత్రి బల్దేవ్ సింగ్‌కు గాని ఈ విజయంలో వాటా దక్కలేదు. ప్రధాని అధ్యక్షతన క్యాబినెట్ ఆమోదం, సైన్యాలకు రక్షణ మంత్రి ఆదేశం లేకుండా సైనికచర్య సాధ్యమయ్యేదేనా?**

జునాగఢ్ (గుజరాత్), హైదరాబాద్ సంస్థానాల్లో పాలకులు ముస్లింలు. మెజార్టీ ప్రజలు హిందువులు. ప్రజామోదం లేని నిరంకుశ రాజ్యాధికారాలను కూలదోసిన వీరునిగా కంటే ముస్లిం పాలనను అంతమొందించిన హిందూత్వ నాయకునిగా పటేల్‌ను స్థిరపరచడంలో గుజరాత్‌లో బీజేపీ విజయం సాధించింది. గుజరాత్‌లోని సర్దార్ సరోవర్ వద్ద ఏకంగా 182 మీటర్ల ఎత్తైన పటేల్ మహా విగ్రహాన్ని ప్రతిష్ఠించింది.

ఇంతకాలం పటేల్‌ను పట్టించుకోని కాంగ్రెస్ ఇప్పుడు కండ్లు తెరిచింది. మొన్నటి అహ్మదాబాద్ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ విస్తృతస్థాయి సమావేశంలో రాహుల్‌గాంధీ ప్రసంగిస్తూ పటేల్ తమవాడని చెప్పి, ఒప్పించడానికి చాలా కష్టపడ్డారు. నెహ్రూ-పటేల్ మధ్య బీజేపీ ప్రచారం చేస్తున్నట్టుగా విభేదాలు లేవని అన్యోన్యంగా ఉండేవారని చెప్పుకొచ్చారు. పటేల్‌కు తామే వారసులమని బీజేపీ చెప్పుకోవడాన్ని ఖండించారు. వాస్తవానికి పటేల్ 1947-50 మధ్యకాలంలో నెహ్రూ మంత్రివర్గంలో ఉప ప్రధాని, హోం మంత్రి. స్వాతంత్ర్యోద్యమ కాలంలో జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు. కనుక ఆయన్ను కాంగ్రెస్ ఎప్పుడో సొంతం చేసుకోవాల్సింది. కానీ, మర్చిపోయారు. విశేషమేమిటంటే నెహ్రూ, ఇందిరమ్మ, రాజీవ్ ప్రధానులుగా ఏలిన కాలంలో భారతరత్న పురస్కారానికి పటేల్ నోచుకోలేదు. 1975 ఆయన శత జయంతి సంవత్సరం. అప్పటి ప్రధాని ఇందిరమ్మ ఆ సందర్భంలోనైనా ప్రకటించి ఉంటే బాగుండేది. పటేల్ గతించిన నాలుగు దశాబ్దాల తర్వాత 1991లో పటేల్‌కు భారతరత్న పురస్కారం ప్రకటించి నాటి ప్రధాని పీవీ పుణ్యం కట్టుకున్నారు. 1975-77 ఎమర్జెన్సీ కాలంలో అఖిలభారత కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేస్తున్న దేవకాంత బారువ 'ఇండియా ఈజ్ ఇందిర, ఇందిర ఈజ్ ఇండియా' అని ఏ ముహూర్తంలో అన్నారో కానీ, తదాదిగా ఇందిరమ్మ, రాజీవ్.. నేడు సోనియమ్మ, రాహుల్. కాంగ్రెస్ అంటే ఇంతే. ఇదే అదనుగా బీజేపీ చాణక్యం ప్రదర్శించి పటేల్‌ను తన వైపు లాగేసుకుంది. కాంగ్రెస్ నేతలకు పటేల్ అవసరం చేతులు కాలాక తెలియవచ్చింది. తమపై బీజేపీ చల్లుతున్న బురద నుంచి తప్పించుకోవడానికి పటేల్ వెనుక దాక్కోవడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నది. అహ్మదాబాద్ ప్రకటన అంతరార్థం అదే. పటేల్‌ను ఎవరైనా అభిమానించవచ్చు. ఆరాధించవచ్చు. కానీ, ఒక మతానికి ప్రతినిధిగా, పరిరక్షకునిగా వక్రీకరించి చూపడం పటేల్‌ను అవమానించడమే. దురదృష్టం ఏమిటంటే.. బీజేపీ ప్రత్యక్షంగా, కాంగ్రెస్ పరోక్షంగా అదే పని చేస్తున్నాయి. వాస్తవానికి పటేల్ తన విధ్యుక్తధర్మాన్ని నిర్వర్తించారు. జునాగఢ్, హైదరాబాద్ పాలకులు ఒకవేళ హిందువులై ఉండి, విలీనానికి వ్యతిరేకించినా పటేల్ అదే పని చేసేవారు. గాంధీజీ హత్యానంతరం బీజేపీ మాతృసంస్థ ఆర్‌ఎస్‌ఎస్‌నూ కేంద్ర హోం మంత్రిగా పటేల్ నిషేధించారు. అదే నిజాంను గవర్నర్ స్థాయిలో హైదరాబాద్ రాష్ట్రానికి రాజ్‌ప్రముఖ్‌గా నియమించారు.

వివిధ సందర్భాలలో అప్పటి ప్రధాని నెహ్రూతో పటేల్ విభేదించారు. చరిత్రను సరిగా అర్థం చేసుకోలేని రాజకీయ నాయకులు వికృత వ్యాఖ్యానాలు, విపరీత భాష్యాలు చేస్తున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓ సందర్భంలో ప్రసంగిస్తూ చిత్రంగా కాంగ్రెస్ పూర్వీకుల జాబితాలో భగత్ సింగ్‌ను కూడా చేర్చారు. ఇలా సమర వీరులకు, అమరవీరులకు, దేశభక్తులకు పార్టీలు, మతాలు, కులాల రంగులు పూసుకుంటూపోతుంటే భవిష్యత్తు తరాలకు ఎవరూ స్వచ్ఛంగా, సత్యంగా మిగలరేమో?

> **పటేల్‌ను ఎవరైనా అభిమానించవచ్చు. ఆరాధించవచ్చు. కానీ, ఒక మతానికి ప్రతినిధిగా, పరిరక్షకునిగా వక్రీకరించి చూపడం పటేల్‌ను అవమానించడమే. దురదృష్టం ఏమిటంటే.. బీజేపీ ప్రత్యక్షంగా, కాంగ్రెస్ పరోక్షంగా అదే పని చేస్తున్నాయి. వాస్తవానికి పటేల్ తన విధ్యుక్తధర్మాన్ని నిర్వర్తించారు. జునాగఢ్, హైదరాబాద్ పాలకులు ఒకవేళ హిందువులై ఉండి, విలీనానికి వ్యతిరేకించినా పటేల్ అదే పని చేసేవారు. గాంధీజీ హత్యానంతరం బీజేపీ మాతృసంస్థ ఆర్‌ఎస్‌ఎస్‌నూ కేంద్ర హోం మంత్రిగా పటేల్ నిషేధించారు.**



# నిస్వార్థ ప్రకృతి ప్రేమికుడు వనజీవి

నివాళి



జాజుల దినేష్
96662 38266

**నిస్వార్థ ప్రకృతి ప్రేమికుడు అస్తమించారు. పర్యావరణవేత్తగా, సామాజిక కార్యకర్తగా మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడానికే తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి శాశ్వతంగా ప్రకృతి ఒడిలోకి జారుకున్నారు. పర్యావరణ హితాన్ని కాంక్షిస్తూ అలుపెరుగని ప్రకృతి సేవ చేసిన వనజీవి రామయ్య ఇకలేరు.**

వనజీవి రామయ్య ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లికి చెందినవారు. మొక్కలు నాటడమే తన జీవితాశయంగా పెట్టుకున్న దరిపల్లి రామయ్య పేరు వనజీవి రామయ్యగా స్థిరపడింది. ప్రకృతి ప్రేమికుడైన రామయ్యకు ఆయన సతీమణి జానమ్మ తోడయ్యారు. ఆ దంపతులు కోటికి పైగా మొక్కలు నాటి చరిత్ర సృష్టించారు. ఖాళీ స్థలాలు, రోడ్ల పక్కన, ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాలు కనిపిస్తే చాలు వనజీవి మొక్కలు నాటేసేవారు. 2022లో వనజీవికి రోడ్డు ప్రమాదం జరిగింది. ఆయన గాయపడ్డారు. అయితే, ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌కు వనజీవి ప్రత్యేక శిక్ష విధించారు. పోలీస్ కేసు పెట్టకుండా, బదులుగా అతడితో 100 మొక్కలు నాటించి, వాటిని సంరక్షించాలని ఆదేశించారు. ప్రమాదం చేసిన వ్యక్తిని క్షమించడంతో పాటు మొక్కలపై తనకున్న ప్రేమను ఈ విధంగా రామయ్య చాటుకున్నారు. మొక్కలపై వనజీవికి ఎంత ప్రేమ ఉందో చెప్పేందుకు ఈ ఘటనే నిదర్శనం.

సమాజ హితం కోసం, భావితరాలకు మంచి వాతావరణాన్ని అందించాలన్న సత్సంకల్పం ఉన్న గొప్పవ్యక్తి రామయ్య. ఒంట్లో సత్తువ ఉన్నంతవరకు ఆయన మొక్కలు నాటుతూనే ఉన్నారు. జీవిత చరమాంకంలో ఆరోగ్యం సహకరించకున్నా వెనకడుగు వేయలేదు. ఎండా కాలంలో అడవుల్లో తిరుగుతూ వివిధ విత్తనాలను సేకరించేవారు. వాటిని బస్తాల్లో నింపి ఇంటి దగ్గర నిల్వచేసేవారు. అందులో ఎవరికీ తెలియని చెట్ల విత్తనాలే ఎక్కువగా ఉండేవి. తొలకరి చినుకులు పడగానే మొక్కలు నాటే కార్యక్రమంలో మునిగిపోయేవారు. తాను మొక్కలను పెంచడం మాత్రమే కాదు.. పదిమందికి విత్తనాలు పంచి, పెంచమని సూచించేవారు.

పర్యావరణ పరిరక్షణ పట్ల వనజీవికి ఉన్న నిబద్ధతకు గుర్తింపుగా ఆయన జీవిత కథను పర్యావరణ పరిరక్షణ సందేశంగా పాఠ్యాంశాల్లోనూ చేర్చారు. మహారాష్ట్రలో వనజీవి జీవితాన్ని 9వ తరగతి తెలుగు పుస్తకంలో పాఠ్యాంశంగా బోధిస్తున్నారు. తెలంగాణలో 6వ తరగతి సాంఘిక శాస్త్రంలో పాఠ్యాంశంగా చేర్చారు. ట్రీ మ్యాన్ ఆఫ్ ఇండియాగా గుర్తింపు పొందిన రామయ్య సేవలకుగాను పలు సంస్థలు అవార్డులతో సత్కరించాయి. రామయ్య సేవలను గుర్తించిన కేంద్రప్రభుత్వం పద్మశ్రీతో సత్కరించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థల నుంచి ఆయన అనేక అవార్డులు, రివార్డులు అందుకున్నారు. ప్రస్తుతం నగరాల్లో అభివృద్ధి పేరిట నగరాలు కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్నాయి. అభివృద్ధి పేరిట పచ్చని చెట్లను నరికేసి పెద్దపెద్ద భవంతులు నిర్మిస్తున్నారు. ప్రకృతి పరిరక్షణకు సర్వస్వం ధారపోసిన వనజీవి అస్తమించడం పర్యావరణానికి తీరని లోటు.

# అంబేద్కర్‌కు సంకెళ్లు తీస్తరా? తియ్యమంటరా?



డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్

'పోరాటాలు, అమరుల త్యాగాల పునాదులపై తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం వచ్చింది. ప్రజలకు స్వేచ్ఛ వచ్చింది. ప్రగతి భవన్ ఇనుప కంచెలను బద్దలు కొట్టాం. తెలంగాణ ప్రజలు ప్రజాభవన్‌కు ఎప్పుడైనా రావచ్చు, పోవచ్చు. మేం పాలకులం కాదు, మీ సేవకులం...' ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన నాడు సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన మాటలు ఇవి. కానీ, నేడు పూర్తిగా అందుకు విరుద్ధంగా ఆయన వ్యవహరిస్తున్నారు. తెలంగాణ సాధకుడు కేసీఆర్‌పై అక్కసుతో ప్రజలను ఇబ్బందులపాలు చేస్తున్నారు. ప్రజల మనోభావాలతో ఆడుకుంటున్నారు.

కేసీఆర్ గుర్తులను చెరపడమే తమ లక్ష్యమని బాహాటంగా ప్రకటించిన రేవంత్ రెడ్డి.. ఆ దిశగా పరుగులు పెడుతున్నారు. బీఆర్‌ఎస్‌పై కక్షసాధింపులకు పాల్పడుతూ, ప్రతిపక్షంపై అక్రమ కేసులు బనాయిస్తూ, అసమర్థ పాలనను కొనసాగిస్తున్నారు. అమరుల త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణ అని చెబుతూనే అమరవీరుల స్థూపానికి కంచెలు వేశారు. స్వేచ్ఛ కల్పించామని గప్పాలు కొడుతూనే ప్రజల ఆర్థిక స్వేచ్ఛను హరించారు. ప్రగతి భవన్ కంచెలు బద్దలు కొట్టామని, ప్రజలు ఎప్పుడైనా రావచ్చని చెబుతూనే జూబ్లీ హిల్స్ ప్యాలెస్ చుట్టూ కంచెలు మొలిపించారు. ఇందిరమ్మ రాజ్యం తెచ్చామని గొప్పలకుపోతూ ఎమర్జెన్సీ రాజ్యాన్ని తీసుకొచ్చారు. ఆత్మగౌరవానికి నిలువెత్తురూపమైన ఆకాశమంత అంబేద్కర్‌కు కూడా సంకెళ్లు వేశారు.

రేవంత్‌రెడ్డికి అంబేద్కర్ అన్నా, దళితులన్నా ఏ మాత్రం గౌరవం లేదు. ఇంకా చెప్పాలంటే ఆయన దళితులను కనీసం మానవ మాత్రులుగా కూడా చూడరు. అందుకే, ఇటీవల ఓ సమావేశంలో 'మా బాయిల కాడ పనిచేసేది మీరే కదా' అని తన అహంకార ధోరణిని బయట పెట్టుకున్నారు. దళితులు అభ్యున్నతి సాధించి, ఆర్థికంగా పురోగతి సాధిస్తే ఆయన వద్ద పనిచేసే వాళ్లు ఎవరూ ఉండరనేది రేవంత్ రెడ్డి ఆలోచన.

> **దళితుల అభ్యున్నతిని కాంక్షించి కేసీఆర్ సర్కార్ తీసుకువచ్చిన దళితబంధును అటకెక్కించారు. ఎన్నికలకు ముందు కేసీఆర్ ఇస్తున్న రూ.10 లక్షలకు తోడు మరో రెండు లక్షలు కలిపి రూ.12 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు అసలుకే ఎసరు పెట్టారు. దళిత జాతి ప్రగతి దిశగా అడుగులు వేయకూడదనే దురుద్దేశంతోనే రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని పక్కన పెట్టేశారు.**

కేసీఆర్ కట్టించారనే అక్కసుతో దేశంలోనే అతిపెద్దదైన అంబేద్కర్ విగ్రహానికి కూడా రేవంత్‌రెడ్డి సంకెళ్లు వేసి, అవమానిస్తున్నారు. చుట్టూ కంచెలు మొలిపించారు. అంబేద్కర్ జయంతి, వర్ధంతి నాడు ఒక్క పూలమాల కూడా వేయడం లేదు. ఇతరులూ వేయకుండా అడ్డుకుంటున్నారు. అలంకరణ చేయడం లేదు. కనీసం చుట్టుపక్కల పరిసరాలను కూడా శుభ్రం చేయడం లేదు. గతేడాది



పార్లమెంట్ ఎన్నికల ముందు అంబేద్కర్ జయంతి నాడు కనీసం నివాళులర్పించకుండా ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపారు. అదే ఎన్నికల కోడ్ ఉండగా.. మే 21న మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి నాడు నివాళులర్పించారు. అప్పుడు రేవంత్ రెడ్డికి ఎన్నికల కోడ్ అడ్డు రాలేదా?

కేసీఆర్ నిర్మించి, మహనీయుడు అంబేద్కర్ పేరు పెట్టిన సచివాలయంలో అడుగుపెట్టడం కూడా రేవంత్‌రెడ్డికి ఏ మాత్రం ఇష్టం లేదు. అందుకే ఆయన జూబ్లీహిల్స్ ప్యాలెస్‌కు, కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు పరిమితమవుతున్నారు. రేవంత్‌రెడ్డి అహంకార ధోరణి అంతటితో ఆగలేదు. దళితుడన్న ఒకే ఒక్క కారణంతో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు యాదాద్రి సాక్షిగా చిన్నపీట వేశారు. ఇలా ఒకటా, రెండా.. అంబేద్కర్‌ను, దళితులను రేవంత్‌రెడ్డి అనేక విధాలుగా అవమానించారు, అవమానిస్తూనే ఉన్నారు.

మహనీయుడు అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 2, 3 ప్రకారం ఏర్పడిన తెలంగాణకు నేడు రేవంత్‌రెడ్డి సీఎంగా ఉన్నారు. ఆ విషయాన్ని ఆయన మర్చిపోయినట్టున్నారు. అదే రాజ్యాంగంలో అంబేద్కర్ మరో ఆర్టికల్‌ను కూడా పొందుపరిచారు. హామీలను మరిచి, ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చకుండా, అహంకార ధోరణితో వ్యవహరించే వాళ్లను గద్దె దించేందుకు ఆర్టికల్ 326 ప్రకారం ఓటుహక్కు కల్పించారనే విషయాన్ని రేవంత్‌రెడ్డి గుర్తుంచుకుంటే మంచిది. అంబేద్కర్ కల్పించిన ఓటుహక్కుతో ప్రజలు ఆయనను ఓడించే రోజు దగ్గరలోనే ఉంది.

ఏప్రిల్ 14న మరోసారి అంబేద్కర్ జయంతి వస్తున్నది. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన తప్పును గ్రహించి, కేసీఆర్ నిర్మించిన ఆకాశమంత ఎత్తున్న అంబేద్కర్ విగ్రహం వద్ద ఉన్న గేట్లను తెరువాలి. అంబేద్కర్‌కు నివాళులర్పించాలి. లేకపోతే ఆత్మగౌరవ పోరు తప్పదు. వేలాది మందితో అంబేద్కర్ విగ్రహం వద్దకు బైలెల్లుతాం. విగ్రహం చుట్టూ మొలిచిన కంచెలను కూకటివేళ్లతో సహా పెకిలిస్తాం. అంబేద్కర్‌కు రేవంత్‌రెడ్డి వేసిన దాస్య శృంఖలాలను తెంచుతాం.

(వ్యాసకర్త: ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్)

# మహనీయుల మాసం ఏప్రిల్

> **ఈ దేశంలో కొన్ని వేల సంవత్సరాలుగా సామాజిక వివక్షను ఎదుర్కొంటూ, ఆర్థిక దోపిడీకి గురవుతున్నవారు అణగారిన వర్గాలే. ఈ నేపథ్యంలో అణగారిన వర్గాలు, మహిళాపై చిన్నచూపు చూస్తున్న సమాజంపై కొందరు సంఘసంస్కర్తలు శంఖం పూరించారు. యాదృచ్ఛికంగా వారిలో చాలామంది జయంతులు, వర్ధంతులు ఏప్రిల్‌లోనే ఉండటం విశేషం.**


ఏప్రిల్ 3న శివాజీ వర్ధంతి, ఏప్రిల్ 5న బాపు జగ్జీవన్‌రామ్ జయంతి, ఏప్రిల్ 11న మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి, ఏప్రిల్ 13న బీపీ మండల్ వర్ధంతి, ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి, ఏప్రిల్ 16న కందుకూరి వీరేశలింగం జయంతి, ఏప్రిల్ 18న దొండో కేశవ్ కార్వే జయంతి, ఏప్రిల్ 23న విఠల్ రాంజీ షిండే జయంతి, ఏప్రిల్ 26న బాబా ఆమ్టే జయంతి. ఇలా ఈ మాసాంతం సంఘసంస్కరణ కోసం పాటుపడిన మహనీయుల జయంతో, వర్ధంతో జరుపుకుంటూ వారి సేవలను స్మరించుకుందాం.

> **క్షత్రియులే కాదు, అణగారిన వర్గాలు కూడా రాజ్యాధికారాన్ని చేపట్టి రాజ్యాలను ఏర్పాటు చేయగలరని నిరూపించిన యోధుడు శివాజీ. తరతరాలుగా సామాజిక వివక్షకు గురవుతున్నవారి పక్షాన పూలే పోరాడారు. ఒకవైపు అక్షర జ్ఞానం నేర్పుతూనే మరోవైపు సామాజిక పరివర్తనకు నడుంకట్టి వేల ఏండ్లుగా వస్తున్న దురాచారాలను పెకిలించారు.**

పూలే మరణించిన ఏడాది తర్వాత 1891 ఏప్రిల్ 14 మరో సామాజిక విప్లవ యోధుడు అంబేద్కర్ జన్మించారు. సామాజిక వివక్షతో పాటు, ఆర్థిక దోపిడీ, రాజకీయ అసమానతలపై ఆయన పోరు సలిపారు. స్వాతంత్ర్య భారతదేశంలో 'నా జాతుల స్థానం ఏమిట'ని ప్రశ్నించారు. రాజ్యాధికారంలో ప్రాతినిధ్యం లేని జాతులు అంతరిస్తాయని పేర్కొంటూ రాజకీయ చైతన్యం కోసం పోరాడారు. తరతరాలుగా దోపిడీకి గురైన వర్గాలకు రాజ్యాంగ రక్షణ కల్పించారు. ఇతర వెనకబడిన తరగతులకు కూడా రాజ్యాంగ హక్కులు ఉండాలని 340 లాంటి ఆర్టికల్స్‌ను రాజ్యాంగంలో పొందుపరిచారు.

పూలే, అంబేద్కర్ లాగానే మరో సామాజిక యోధుడు బీపీ మండల్. ఉన్నత ఉద్యోగాన్ని కాదని వెనుకబడిన వర్గాల కోసం రాజకీయ పోరాటం నడిపారు. రామ్ మనోహర్ లోహియా ప్రేరణతో సంయుక్త సోషలిస్ట్ పార్టీలో చేరి, ఆరోగ్యశాఖ మంత్రిగా సేవలందించారు. 1967 షోషిత్ దళ్ పార్టీని స్థాపించి, బీహార్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. సీఎంగా, ఎంపీగా సేవలందించినప్పటికీ రెండో ఓబీసీ కమిషన్ చైర్మన్‌గానే ఆయన గుర్తింపు పొందారు. ఇతర వెనుకబడిన తరగతుల సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా ప్రయోజనాల కోసం బీసీ కమిషన్ చైర్మన్‌గా 40 సిఫారసులను కేంద్ర ప్రభుత్వానికి అందించారు. వీపీ సింగ్ హయాంలో విద్యా, ఉద్యోగాల్లో ఓబీసీలకు రిజర్వేషన్లు అమలయ్యేలా చేశారు. సామాజిక సంస్కరణల కోసం పాటుపడిన ఎందరో మహనీయుల జయంతులు, వర్ధంతులు ఈ నెలలోనే ఉన్నాయి. అందుకే ఇది మహనీయుల మాసం.

**- జుర్రు నారాయణ యాదవ్,** 94940 19270




# ఇది రాష్ట్రాల విజయం



సుప్రీంకోర్టులో మనకు ఈరోజు (శనివారం) చరిత్రాత్మక విజయం దక్కింది. బిల్లుల ఆమోదానికి సంబంధించి గవర్నర్ల పాత్రపై దేశ సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పు మనకు (తమిళనాడు) మాత్రమే కాదు, దేశంలోని అన్ని రాష్ట్రాల గెలుపు. ఇది ఫెడరలిజం, రాష్ట్రాల స్వయంప్రతిపత్తికి నిదర్శనం

**- ఎంకే స్టాలిన్, తమిళనాడు సీఎం**